జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
శనివారం 23 మే 2026 ♦ పేజీలు : 5





## సామాజిక చైతన్యానికి భాగ్యరెడ్డి వర్మ సేవలు చిరస్మరణీయం : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా ఘన నివాళులు



మహబూబ్‌నగర్, మే 22 (ప్రజా జ్యోతి బ్యూరో) సామాజిక సంస్కర్త ఎం.వి. భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్

మిగతా 2 లో...



# కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుంది

రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి

నారాయణపేట ప్రతినిధి మే 22 (ప్రజాజ్యోతి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల యాక్షన్ ప్లాన్" లో భాగంగా నారాయణపేట జిల్లా గాయత్రి ఫంక్షన్ హాల్, నారాయణపేటలో జిల్లా సంక్షేమ శాఖ మరియు తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లాకు చెందిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, విశిష్ట అతిథిగా తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ శ్రీ ముత్తినేని వీరయ్య గారు, జిల్లా కలెక్టర్ శ్రీమతి సి.హెచ్. ప్రియాంక, అదనపు కలెక్టర్ శ్రీ ఎస్. శ్రీను, మక్తల్, నారాయణపేట, మద్దూర్, కోస్గి మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు

మిగతా 2 లో...







## అన్నాసాగర్‌లో ఈదురుగాలుల బీభత్సం

- కూలిపోయిన విద్యుత్ స్తంభాలు...
- గాలికి వదిలేసిన అధికారులు..!

నారాయణపేట ప్రతినిధి మే 22 (ప్రజా జ్యోతి) దామరగిద్ద మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో ఈదురుగాలులు తీవ్ర బీభత్సం సృష్టించాయి. భారీ గాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు నేలకూలి, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ తీగలు రహదారులపై పడిపోవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఘటన జరిగి గంటలు గడుస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు,



సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ప్రాణాలకు ముప్పుగా



విద్యుత్ తీగలు రోడ్డుపై పడివున్నా అధికారులు స్పందించకపోవడంపై

మిగతా 2 లో...

## దళితుల చైతన్యానికి భాగ్యరెడ్డి వర్మ సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

వనపర్తి, మే 22 (ప్రజాజ్యోతి): దళితుల అభ్యున్నతి, అనగారిన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా



నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాల్య వివాహాలు, అంటరానితనం, దేవదాసి, జోగిని వంటి సామాజిక దురాచారాల నిర్మూలన కోసం భాగ్యరెడ్డి వర్మ విశేషంగా కృషి చేశారని కొనియాడారు. దళిత ఉద్యమ పితామహుడిగా, సంఘ సంస్కర్తగా ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. మహనీయుల జయంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం

మిగతా 2 లో...

# అన్నాసాగర్‌లో ఈదురుగాలుల బీభత్సం

(మొదటి పేజీ తరువాయి...)



తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. "ఏదైనా ప్రాణనష్టం జరిగితే బాధ్యత ఎవరిది..?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో చిన్నపిల్లలు, రైతులు, పశువులు సంచరిస్తున్న ప్రాంతాల్లోనే తీగలు వేలాడుతూ ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి, ప్రమాదకరంగా ఉన్న తీగలు, స్తంభాలను తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# దళితుల చైతన్యానికి భాగ్యరెడ్డి వర్మ సేవలు చిరస్మరణీయం

(మొదటి పేజీ తరువాయి...)

ఆనందదాయకమని, వారి చరిత్ర, త్యాగాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం మహానుభావులు చూపిన మార్గంలో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాంజీరావు, మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ గంధం నాగరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సామాజిక చైతన్యానికి భాగ్యరెడ్డి వర్మ సేవలు చిరస్మరణీయం

(మొదటి పేజీ తరువాయి...)

ఖుష్బూ గుప్తా పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భాగ్యరెడ్డి వర్మ ఆది-హిందూ ఉద్యమానికి నాయకత్వం వహించి దళిత సమాజంలో సామాజిక చైతన్యం, విద్యాభివృద్ధి, ఆత్మగౌరవం పెంపొందించేందుకు విశేష కృషి చేశారని తెలిపారు. సమానత్వం, విద్యా ప్రాధాన్యత, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ గుమ్మాల మమత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఆర్వో రామ్‌రెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాంటా వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలి

- రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ హరిప్రియ సూచన



**గండీడ్, మే 22: (ప్రజా జ్యోతి)** కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ హరిప్రియ సూచించారు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపోవడంతో విషయం తెలుసుకున్న ఆమె శుక్రవారం వెన్నచెడు, సల్కరిపేట్, రెడ్డిపల్లి గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని రైతులకు సూచించారు. అలాగే కాంటా వేసిన ధాన్య బస్తాలను ఆలస్యం చేయకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. లారీలు ఆలస్యంగా వస్తే ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని తరలించిన పక్షంలో సంచికి రూ.10 చొప్పున సివిల్ సప్లై అధికారులు చెల్లిస్తారని చెప్పారు. ధాన్యం తరలింపులో ఎలాంటి అలసత్వం వహించవద్దని నిర్వాహకులను ఆదేశించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు సమాచారం అందజేసి రైతులకు సరిపడా సంచులు అందించాలని సూచించారు. వెన్నచెడు రైస్ మిల్ పైకప్పు ఎగిరిపోవడంతో మరమ్మతులు పూర్తయ్యే వరకు ఆ మిల్లుకు ధాన్యం పంపవద్దని, రెడ్డిపల్లి మరియు మహ్మదాబాద్‌లోని రైస్ మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరావు, సివిల్ సప్లై డీడీ రవి నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంత లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, వెన్నచెడు ఉపసర్పంచ్ రవికాంత్ రెడ్డి, చిన్నయ్య పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుంది





(మొదటి పేజీ తరువాయి...)

మరియు దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అతిథులు ప్రశంసించారు. ప్రత్యేకంగా దివ్యాంగుల స్వయం ఆధారిత జీవనానికి దోహదపడే విధంగా రిట్రోఫిటెడ్ మోటార్ వాహనాలు (34), బ్యాటరీ వీల్ చైర్ ట్రైసైకిల్ – 10, టలాప్టాప్ (08), చెవి వినికిడి యంత్రాలు (2) లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరవ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధి మరియు సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. కొత్త ఆలోచనలు, కొత్త అవకాశాలు దివ్యాంగుల జీవితాల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి పెద్దన్నలా, ఆత్మీయ బంధువులా అండగా నిలుస్తున్నారని తెలిపారు. అలాగే తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ శ్రీ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం దివ్యాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే కల్యాణ లక్ష్మి పథకంతో పాటు అదనంగా రూ.2 లక్షల వివాహ ప్రోత్సాహక బహుమతి అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఐదు సంవత్సరాల లోపు దివ్యాంగ చిన్నారులకు శస్త్ర చికిత్సలు నిర్వహించి సాధారణ జీవితం గడిపేలా చేయడం కోసం "బాల భరోసా" కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయ ఉపకరణాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి సి.హెచ్. ప్రియాంక మాట్లాడుతూ దివ్యాంగ మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే దివ్యాంగులకు అవసరమైన సహాయ సహకారాలు ప్రభుత్వం తరపున అందించబడతాయని తెలిపారు. దివ్యాంగ మహిళలు తప్పనిసరిగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లలో చేరాలని కోరారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీ ఎల్. రాజేందర్ గౌడ్ గారు మాట్లాడుతూ దివ్యాంగులకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హులైన ప్రతి దివ్యాంగునికి సహాయ పరికరాలు అందజేస్తామని, ఇప్పటివరకు పొందని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో Dist అడిషనల్ కలెక్టర్ శ్రీ S. శ్రీను ,RDO ఎల్. రమేష్ , డీపీవో సుధాకర్ రెడ్డి , ఇతర జిల్లా అధికారులు మరియు ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ సాయి , లబ్ధిదారులు, దివ్యాంగులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- రైతులకు భరోసా కల్పించిన అనంత లక్ష్మారెడ్డి



**గండీడ్, మే 22: (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అనంత లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం వెన్నచెడ్ గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించి రైతులను పరామర్శించారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అనంతరం గ్రామంలో ఓ ఇంటి రేకుల పైకప్పు ఎగిరిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలి
- మాటలకే పరిమితమైన ప్రజా ప్రభుత్వం..?
- బిజెపి రాష్ట్ర నాయకుడు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్



**నాగర్ కర్నూల్ మే 22 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** రైతులు ఆరుగాలం కష్టపడి, పండించిన మక్కజొన్న పంటను కొనలేని స్థితిలో... కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉందని మాజీ ఎమ్మెల్యే గువ్వల విమర్శించారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిచి ముద్దయిన ధాన్యాన్ని శుక్రవారం బిజెపి శ్రేణులతో కలిసి మార్కెట్ యార్డ్ లో సందర్శించి, పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దాన్యం కొనలేని స్థితిలో ఉందని, కొనుగోలు చేయడంలో జాప్యం చేయడం సరైనది కాదని ఆయన మండిపడ్డారు. అదేవిధంగా అకాల వర్షానికి తడిచి ముద్దైన పంటను ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని ఆయన కోరారు. రైతులకు పండగ ఉండాల్సిన ప్రభుత్వం, వాళ్ల సమస్యలు పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. అదే మాదిరిగా రైతులు తీసుకు వచ్చిన ప్రతి గింజను గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు చేయకపోతే రైతుల పక్షాన బిజెపి పార్టీ శ్రేణులతో కలిసి, పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట బిజెపి శ్రేణులు రైతులు తదితరులు ఉన్నారు.

# జిల్లా మూడో స్థానం - మండల తొలి స్థానం సాధించిన గౌతమ్ చక్రికి ఘనంగా సత్కారం





**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.** మండల కేంద్రానికి చెందిన విద్యార్థి పదవ తరగతి ఫలితాల్లో జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థి గౌతమ్ చక్రి జిల్లా స్థాయిలో మూడో స్థానం మండల స్థాయిలో మొదటి స్థానం సాధించి ప్రతిభ చాటాడు. విద్యార్థి సాధించిన ఈ విజయంతో పాఠశాల ఉపాధ్యాయులు మరియు గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. సందర్భంగా శుక్రవారం జిల్లాలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ స్వరాభి మరియు జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని చేతుల మీదగా గౌతమ్ చక్రి ప్రశంస పత్రం మరియు సీల్డ్ అందుకున్నారు. అధికారులు విద్యార్థిని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు భాను ప్రకాష్‌మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కూడా కృషి చేస్తే ఉన్నత ఫలితాలు సాధించగలరని గౌతమ్ చక్రి నిరూపించాడన్నారు. ఉపాధ్యాయ బృందం విద్యార్థి క్రమశిక్షణ పట్టుదల కష్టపడి చదివితే స్వభావమే విజయానికి కారణమని తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులు బత్తుల రాముడు, లక్ష్మి తమ కుమారుడు సాధించిన విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ మీసాల పర్వతమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎత్వం చిట్టెమ్మ గ్రామ పెద్దలు విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

# అంటరానితన నిర్మూలనకు భాగ్యరెడ్డి వర్మ విశేష కృషి

- అదనపు కలెక్టర్ మధు మోహన్





**గద్వాల మే 22(ప్రజా జ్యోతి):** అంటరానితనం,కుల వివక్ష నిర్మూలన కోసం భాగ్యరెడ్డి వర్మ విశేషంగా పోరాడారని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్ పేర్కొన్నారు.దళిత వైతాళికుడిగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన మధుమోహన్ మాట్లాడుతూ, మహనీయుల జీవితం నుంచి స్ఫూర్తి పొందేందుకు, వారు సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రతి ఏడాది భాగ్యరెడ్డి వర్మ వంటి మహనీయుల జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు.భాగ్యరెడ్డి వర్మ హైదరాబాద్ సంస్థాన కాలంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి విద్యాభివృద్ధికి విశేషకృషి చేశారని కొనియాడారు.కులవివక్షను ఎదుర్కొని ఉన్నత స్థాయికి చేరుకున్న మహనీయుల్లో భాగ్యరెడ్డి వర్మ ఒకరని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సుషిత,బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, సర్వే ఏడీ నూకరాజు,కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి తదితర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



**నారాయణపేట ప్రతినిధి మే 22 (ప్రజా జ్యోతి )** నారాయణపేట జిల్లా కేంద్రంలోని బహార్ పేట లో గల చౌడేశ్వరి మాత అమ్మవారి ఆలయ నిర్మాణానికి గాను అమ్మవారి భక్తుడు జరంగ్ రాము రూ. 26 వేల విరాళం అందించారు. అంతకు ముందుగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి తన వంతు ఆర్థిక సహాయం అందించిన దాతలు ఆలయ కమి టీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అప్పిరెడ్డిపల్లి రాము, కురువ మనోజ్, గడ్డం వినోద్, మసి పవన్, జెట్టి అంజి, బాపన్ పల్లి రవి, పల్లెగేరీ రాజు, ఆలయ కమిటీ సభ్యులు ఉట్కూర్ నర్సింహులు, గురు మేస్త్రి, శంభు ప్రభాకర్, శంభు కృష్ణ, మన్నే ఎల్లప్ప, దత్తు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వద్దు ప్రకృతి ముద్దు

- భూమిని కాపాడితే భూమి మనల్ని కాపాడుతుంది పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెదిరిపాడ్ ప్రధానోపాధ్యాయులు బాలకిష్టప్ప
- కాలుష్యం తగ్గిస్తే ఆరోగ్యం పెరుగుతుంది
- జాతీయ హరిత దళం జిల్లా కోఆర్డినేటర్ హెచ్ భాను ప్రకాష్





**నారాయణపేట ప్రతినిధి మే 22 (ప్రజా జ్యోతి )** శుక్రవారం రోజు సమ్మర్ క్యాంపులో జాతీయ హరిత దళం నారాయణ పేట జిల్లా ఆధ్వర్యంలో పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెదిరి పాడు లో పర్యావరణ విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించినాము ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పర్యావరణ విద్యపై అవగాహన చిత్రలేఖన పాటలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా జాతీయ హరిత దళం జిల్లా కోఆర్డినేటర్ హెచ్ భాను ప్రకాష్ మరియు పాఠశాల జి హెచ్ ఎం బాలకిష్టప్ప మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలి భూమిపై ఎన్నో రకములైన కాలుష్యాలు ఉంటాయి . ప్రస్తుత కాలంలో పర్యావరణ కాలుష్యం మానవాళికి పెను సవాలుగా మారింది. పెరుగుతున్న వాయు, జల, నేల కాలుష్యం వల్ల భూతాపం, అకాల వర్షాలు, తాగునీటి ఎద్దడి వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుని బాధ్యత. చెట్లు నాటడం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, నీరు –విద్యుత్ పొదుపు చేయడం ద్వారా మనం భూమిని కాపాడుకోవచ్చు. 'ఒక్కో విద్యార్థి – ఒక్క చెట్టు' కార్యక్రమం కింద మా పాఠశాలలో 500 మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను విద్యార్థులకు అప్పగిస్తున్నాం" అని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'హరితహారం' కార్యక్రమ స్ఫూర్తితో మన ఊరును పచ్చదనంతో నింపుదాం. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించడం మన కర్తవ్యం" అని పిలుపునిచ్చారుప్రతి ఇంటికి చెట్టు నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని తెలియజేశారు చిత్రలేఖ పోటీలలో ప్రథమ బహుమతి కళ్యాణి ద్వితీయ బహుమతి జి రక్షిత తృతీయ బహుమతి సి భవాని కీర్తన గెలుపొందినారు వారికి బహుమతులు మరియు ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ సి ఆర్ పి కళాప్ప మరియు రవి నాయక్ సమ్మర్ క్యాంప్ వాలంటీర్స్ నవీన్ నరేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# చేనేత హక్కుల సాధన సభను విజయవంతం చేయాలి:చేనేత సంఘాల పిలుపు



**గద్వాల మే 22(ప్రజా జ్యోతి ప్రతినిధి ):** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో చేనేత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో 'చేనేత హక్కుల సాధన సభ'కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,మే 25, 2026 సోమవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ మరియు బీసీ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న చేనేత హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అంతరించిపోతున్న చేనేత పరిశ్రమను కాపాడడం,చేనేత కార్మికులకు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అమలు చేయించడం,నడిగడ్డ ప్రాంతంలోని చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ఈ సభ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ సభకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు,మాజీ ఎమ్మెల్సీలు,మాజీ ఎమ్మెల్యేలు,చేనేత సామాజిక వర్గ ప్రజాప్రతినిధులు,మాజీ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవి,తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ తదితర ముఖ్య నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు.జిల్లాలోని చేనేత కార్మికులందరూ సభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడం రామకృష్ణ,మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అక్కల రమాసాయిబాబా,9వ,వార్డు కౌన్సిలర్ శ్రీరామలింగేశ్వర కాంళ్లే, 21వ,వార్డు కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్,గద్వాల మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మహంకాళి కరుణాకర్,జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు తిరుమల త్యాగరాజు,మాజీ ఆప్కో డైరెక్టర్ దామ వీరన్న,కోట నరసింహులు,చిలివేరి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టాలి

- ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి.
- ముందస్తు అడ్మిషన్ల పేరుతో చలామణి అవుతున్న పర్మిషన్ లేని విద్య సమస్తలపై చర్యలు తీసుకోవాలి.
- అందరికి ఉచిత నాణ్యమైన విద్యను అందించాలి.
- పిడిఎస్యు - పి వై ఎల్ పిఓడబ్ల్యు సంఘాల డిమాండ్



**నారాయణపేట ప్రతినిధి మే 22 (ప్రజా జ్యోతి )** ప్రజలను ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్న ప్రైవేట్ , కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చెయ్యాలని,అధిక ఫీజులను నియంత్రణ చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ పిడిఎస్యు, పివైఎల్, పిఓడబ్ల్యు సంఘాల రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా నారాయణ పేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు కె.కాశీనాథ్ మొదట సంతకం చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు కాశీనాథ్, పి వై ఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రామకృష్ణ, పిఓడబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి, పిడిఎస్యు జిల్లా అధ్యక్షకార్యదర్సులు వెంకటేష్, మహేష్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ టౌన్ కార్యదర్శి కెంచి నారాయణ, టి యు సి ఐ జిల్లా కార్యదర్శి రాము, జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహా, ఏఐపీకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు, పి వై ఎల్ జిల్లా ఉపాధ్యక్షులు జె రాము, Y అంజి, పి ఓ.డబ్లు జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మి, నాయకులు సుజాత, సునీత, చంద్రకళ, పి.డి.ఎస్.యు జిల్లా సహాయ కార్యదర్శి రాజు, జిల్లా రమేష్, మహేష్,జోగేష్,అనిల్ పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికట్టాలి

- జిల్లా కోఆర్డినేటర్ హాజమ్మ

**నర్వమే 22 ప్రజా జ్యోతి** నారాయణపేట జిల్లా నర్వ మండలం పాతర్చేడు గ్రామంలో శుక్రవారం ఆపరేషన్ మెర్సి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో y ప్రభుత్వ పథకాలు సామాజిక అంశాలు అనే అంశాల మీద అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ హాజమ్మ మాట్లాడుతూ మన జిల్లాలో 350 గ్రామాలలో మా సంస్థ పనిచేస్తుందని మూఢనమ్మకాలు జోగిని వ్యవస్థ బాల్యవివాహాలు మీద పనిచేస్తున్నామని తెలియజేయడం జరిగింది ఇదే విధంగా నర్వ మండల కోఆర్డినేటర్ ఎస్ పౌలు మాట్లాడుతూ టెన్త్ పాస్ అయిన విద్యార్థులు ఉంటే వారికి టైలరింగ్ కంప్యూటర్ బ్యూటిషన్ మీద ట్రైనింగ్ ఇస్తామని తెలపడం జరిగింది ముఖ్యఅతిథిగా విచ్చేసిన నర్వ గవర్నమెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ మహిళలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు సరియైన పోషకాహారం లేక రక్తహీనతతో బాధపడుతున్నారు బిపి షుగర్ థైరాయిడ్ వ్యాధులతో బాధపడుతున్నారు మహిళలందరూ ఆరోగ్యం పట్ల అవగాహన ఉండాలని సరైన ఆహారం తింటూ ఆరోగ్యం కాపాడుకోవాలని తెలియజేశారు నర్వ హెడ్ కానిస్టేబుల్ నరసింహులు గారు మాట్లాడుతూ మహిళలు జోగినీలుగా చేయరాదని చిన్న పిల్లలకు పెళ్లిళ్లు చేయరాదని అలా చేసిన వారికి శిక్షలు ఉంటాయని తెలియజేశారు మండల కోఆర్డినేటర్ నరసింహులు ఏఎన్ఎం కే నరసమ్మ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ శ్రీకాంత్, మన్యం కానిస్టేబుల్ సారిక, సురేష్,పాల్గొన్నారు ఓఎంఐఎఫ్ సంస్థ హెల్త్ వర్కర్స్ వై లక్ష్మి, కళావతి జయమ్మ నిర్మల వెంకటేశ్వరమ్మ ప్రమీల అంజమ్మ నిర్మల అశ్విని పాల్గొన్నారు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్




**గద్వాల మే 22(ప్రజా జ్యోతి ):** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యత ఇస్తేనే ఆరోగ్యంగా ఉండవచ్చని ఇన్‌చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్ అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్‌లో భాగంగా నిర్వహిస్తున్న యూత్ వీక్ సెలబ్రేషన్స్ సందర్భంగా శుక్రవారం గద్వాల సోమనాద్రి మైదానంలో పచ్చదనం–పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు,యువత పాల్గొని మైదానం పరిసరాలను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా రామలింగేశ్వర గౌడ్ మాట్లాడుతూ,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే దోమలు వ్యాపించి వివిధ రోగాలు సోకే ప్రమాదం ఉందన్నారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు యువత తమ వంతుగా పరిసరాలను శుభ్రం చేయడం,మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రేష్మ ఇలియాజ్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మన్సూర్ అహమ్మద్,విశ్రాంత పీడీ ప్రభాకర్, విజయ్‌కుమార్,దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యరెడ్డి వర్మ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహణ

- సామాజిక సంస్కర్త, దళితోద్యమ ప్రముఖ నాయకుడు భాగ్యరెడ్డి వర్మ జయంతి




**నారాయణపేట ప్రతినిధి మే 22 (ప్రజా జ్యోతి )** ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను జ్యోతి ప్రజ్వలన గావించి, భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, భాగ్యరెడ్డి వర్మ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని అన్నారు. విద్య, సామాజిక సమానత్వం, హక్కుల సాధన కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్యే ప్రధాన ఆయుధమని భావించి, వారికి చైతన్యం కల్పించేందుకు ఆయన నిరంతరం కృషి చేశారని తెలిపారు.భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమానత్వ భావనతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఈ . డి.ఎస్.సి.కార్పొరేషన్ అబ్దుల్ ఖలీల్, డి.వై.ఎస్.ఓ.వెంకటేశ్ శెట్టి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి పట్టుకొమ్మలు కార్యకర్తలు

- మంత్రి వాకిటి శ్రీహరి



**నారాయణపేట ప్రతినిధి మే 22 (ప్రజా జ్యోతి)** రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి నారాయణపేట 8 వ వార్డు కాంగ్రె స్ పార్టీ అధ్యక్షులు సిద్ధన్ లక్ష్మణ్ పుట్టిన రోజు సందర్భంగా శాలువాతో సన్మానించడం జరిగింది ఈ మాట్లాడు తూ కాం గ్రెస్ పార్టీకి నికార్స్ అయినా కార్యకర్తలే పట్టుకొమ్మలని, అలాంటి వారిని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లవేళల కాపాడుకుంటారని, లక్ష్మణ్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా ఆయనను అభినందించారు అన్నారు,కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కందినపల్లి సత్యమ్మ టౌన్ ప్రెసిడెంట్ సలీం కురువ మనోజ్ జరంగు రాము మసి పవన్ హర్షవర్ధన్ రెడ్డి పాల్గొనడం జరిగింది.

# ధాన్య సేకరణ వేగవంతం చేయకపోతే కలెక్టరేట్ ముట్టడి

- బీజేపీ నాయకులు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, పెద్దిరాజు



**వనపర్తి, మే 22 (ప్రజాజ్యోతి):** ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, లేకపోతే రైతులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు వైఫల్యాలను నిరసిస్తూ శుక్రవారం వనపర్తి మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ రైతులు నాలుగు నెలలు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే నెలల తరబడి తూకం జరగక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ధాన్యం రవాణా టెండర్లు అనుభవం లేని వారికి ఇవ్వడంతో కొనుగోలు కేంద్రాలు ధాన్యపు బస్తాలతో నిండిపోయాయని విమర్శించారు. కనీసం 40 లారీలు ఉన్న గుత్తేదారులకు మాత్రమే టెండర్లు ఇవ్వాలనే నిబంధనను ప్రభుత్వం పక్కన పెట్టిందని, అధికార పార్టీ నాయకులు మండలాల వారీగా టెండర్లు పంచుకోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లతో ధాన్యం తరలింపునకు అనుమతులు ఇవ్వడం టెండర్లలో అవకతవకలకు నిదర్శనమన్నారు. అకాల వర్షాల భయంతో రైతులే ప్రైవేట్ ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించుకుంటున్నారని తెలిపారు. తరుగుకోత పేరుతో రైతులను వేధించడం ఆపాలని, మిల్లర్లు ప్రభుత్వ ఆదేశాలను కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ధాన్య సేకరణను వేగవంతం చేసి తరుగుకోతలను పూర్తిగా నివారించాలని, లేదంటే రైతులతో కలిసి భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొర్ల బాబురావు, కోశాధికారి బండారు కుమారస్వామి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాసులు, మున్సిపల్ కౌన్సిలర్ విజయసాగర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రాములు, నాయకులు తిరుమలయ్య, అంజిరెడ్డి నాయక్, సూర్యవంశం శీను, కడమంచి శివ, చిన్నరాయుడు, బాషపోగు నర్సింహ, ఏర్పుల తిరుపతి యాదవ్, కొండోజు గోపీనాథ్, నక్క మహేష్, ఉందేకోటి వెంకటేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు రోడ్డుపై ధర్నా

- తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్
- రైతుల ధర్నాకు సంఘీభావం తెలిపిన నందిమల్ల అశోక్



**గోపాల్‌పేట, మే 22 (ప్రజాజ్యోతి ):** ఉమ్మడి గోపాల్‌పేట మండల రైతులు తమ వరి, మక్కజొన్న ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాలుగు గంటల పాటు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా తరుగు లేకుండా ప్రతి గింజ ను కొనుగోలు చేయాలని రైతులు కోరారు. ఎర్రటి ఎండలో ధాన్యాన్ని రోడ్డుపై పారబోసి నిరసన చేపట్టిన రైతులు జిల్లా కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చే వరకు ధర్నా విరమించబోమని స్పష్టం చేశారు. రైతుల ధర్నాకు సంఘీభావం తెలిపిన జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షాలకు నీళ్లపాలవుతున్నా ప్రభుత్వం స్పం దించడం లేదని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి వెంటనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేష్, చంద్రశేఖర్, మన్నే నాయక్, రాజేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# విత్తన దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ తనిఖీలు




**వడ్డేపల్లి మే 22(ప్రజా జ్యోతి ):** శుక్రవారం వడ్డేపల్లి మండలంలోని శాంతినగర్ ప్రాంతంలో విత్తన దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది.ఈ తనిఖీల్లో అలంపూర్ టెక్నికల్ ఏవో సుబ్బారెడ్డి,శాంతినగర్ సీఐ శంకర్,ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి, వడ్డేపల్లి ఎంఏఓ రాధ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు డీలర్లకు పలు సూచనలు చేశారు.కాలం చెల్లిన విత్తనాలు,లూజ్ విత్తనాల విక్రయాలు చేయరాదని, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మకాలు నిర్వహించకూడదని సూచించారు.ప్రతి కొనుగోలుదారికి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు.నిబంధనలు ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# ధాన్యం కుప్పలను పాడు చేస్తున్న పందులు

- ఊరిలో పందులను వదిలేసిన యజమానులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్థులు





**మహమ్మదాబాద్, మే 22 ( ప్రజా జ్యోతి )** మహమ్మదాబాద్ మండలంలోని నంచర్ల గ్రామంలో పందుల యజమానుల నిర్లక్ష్యంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పందులను నియంత్రణ లేకుండా రోడ్లు, వీధుల్లో వదిలేయడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు యజమానుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోనే కాకుండా పొలాల వద్ద కల్లాల్లో టార్పాలిన్ కవర్లతో కప్పి ఉంచిన ధాన్యాన్ని కూడా పందులు చింపివేసి తింటున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లుతోందని తెలిపారు. పందులు చెత్తకుప్పలు, డ్రైనేజీల వద్ద సంచరిస్తూ అస్వచ్ఛతకు కారణమవుతున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు. వీధుల్లో గుంపులుగా తిరుగుతుండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని బీసీ కాలనీలో కూడా కొనసాగుతోందని స్థానికులు ఆరోపించారు. పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. యజమానులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య ఒక్క నంచర్ల గ్రామానికే పరిమితం కాకుండా మండలంలోని అనేక గ్రామాల్లో ఉందని సమాచారం. గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలను వ్యాధుల బారి నుంచి కాపాడేందుకు పందుల సంచారాన్ని నియంత్రించాలని కోరుతున్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

- టీయూసిఐ డిమాండ్



**నారాయణపేట ప్రతినిధి మే 22 (ప్రజా జ్యోతి)** గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి కి టి యు సి ఐ నాయకులు వింతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బోయిన్‌పల్లి రాము, జిల్లా ఉపాధ్యక్షులు బి. నర్సింహా మంత్రితో మాట్లాడు తూ నిన్న మన ముఖ్యమంత్రి గారు పత్రికమిత్రుల సమావేశంలో కార్మికులకు కనీస వేతనాలు పెంచుతున్నామనీ, ఇది మేడే కానుకగా అని ప్రకటించారు. కార్మికులను జోన్ ల వారీగా విభజించి, అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైవి స్కిల్డ్ అని వేతనాలు ప్రకటించారు. కానీ అందుకో దాదాపు పదిహేను సంవత్సరాల నుండి గ్రామపంచాయతీలలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచినట్టు ప్రకటించలేదు అన్నారు. నిత్యం ప్రజల్లో ఉండి గ్రామాన్ని శుభ్రం చేస్తున్న కార్మికులకు తక్షణమే వేతనాలు పెంచాలని మంత్రిగారిని కోరారు. మంత్రి స్పందిస్తూ రేపు జరిగే క్యాబినెట్ మీటింగ్ లో కచ్చితంగా మాట్లాడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చన్నప్ప మరియు వివిధ గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా ఆదుకుంటాం





- షార్ట్ సర్క్యూట్ తో దుకాణాలు బూడిది కావడం దురదృష్టకరం
- బిజెపి రాష్ట్ర నాయకుడు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

నాగర్ కర్నూల్ మే 22 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి ) నాగర్ కర్నూల్ జిల్లా పదరా మండలం మద్దిమడుగు గ్రామం లో షార్ట్ సర్క్యూట్తో ఐదు దుకాణాలు బూడిది అయినా బాధితులకు.. బిజెపి పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ స్పష్టం చేశారు. శుక్రవారం మద్దిమడుగు గ్రామంలో షార్ట్ సర్క్యూట్తో ఐదు దుకాణాలు బూడిద అయిన సంఘటన విషయం విధితమే.. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ సంఘటన ప్రాంతం వద్ద సందర్శించి, క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ, ప్రతి ఒక్కరికి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందజేయడమే కాకుండా, షార్ట్ సర్క్యూట్తో బూడిద అయిన దుకాణాలను తమ సొంత ఖర్చుతో, నిర్మించి ఇస్తామని బాధితులకు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్ తో నిరాశ్యులైన బాధితులకు ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధితుల తరపున ఆయన కోరారు. అదేవిధంగా పార్టీలకు అతీతంగా సామాజిక కోణంలో ఆలోచించి, ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని ఆయన స్పష్టం చేశారు.

అదేవిధంగా వ్యాపారస్తులు మనోధైర్యం కోల్పోకుండా, జీవనం కొనసాగించాలని ఆయన సూచించారు. బిజెపి పార్టీ తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన వ్యాఖ్యానించారు. మద్దిమడుగు అంజన్న సన్నిధిలో అంత మేలు జరుగుతుందని బాధితులకు మనోధైర్యం నింపారు. ఆయన వెంట బిజెపి శ్రేణులు బాధిత కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# నవజాత శిశువుకు ప్రాణం పోసిన 108 సిబ్బంది

- ధన్వాడ108 అంబులెన్స్ లో ప్రసవించిన మహిళ
- సిపిఆర్ టెక్నిక్ సహాయంతో పసిపాప ప్రాణాన్ని రక్షించారు
- మాతా శిశు అంబులెన్స్ లో వెంటిలేటర్ సహాయంతో మహబూబ్నగర్ కు జిల్లా ఆసుపత్రికి తరలింపు
- 108 సిబ్బందిని అభినందించిన జిల్లా మేనేజర్ సునీల్ కుమార్





నారాయణపేట ప్రతినిధి మే 22 (ప్రజా జ్యోతి) నారాయణపేట జిల్లా: ధన్వాడ మండల కేంద్రంలోని జయశ్రీ తన రెండో కాన్పు నిమిత్తం దగ్గరలో ఉన్న ధన్వాడ ప్రభుత్వాసుపత్రికి చేరుకుంది, అక్కడ వైద్యులు పరీక్షించి తనకు నెలలు నిండకముందే నొప్పులు ఎక్కువ కావడంతో హుటా హుటిన , దగ్గరలో ఉన్న నారాయణపేట జిల్లా ఆసుపత్రికి 108 అంబులెన్స్ లో రిఫర్ చేశారు, సమాచారం అందుకున్న సిబ్బంది తక్షణమే ధన్వాడ ప్రభుత్వ ఆసుపత్రి చేరుకొని, నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్న మార్గమధ్యలో చిన్న చట్టం దగ్గర మహిళా అంబులెన్స్ లోనే మగ బిడ్డకు జన్మనిచ్చింది, అప్పుడే పుట్టిన మగ శిశువు పుట్టగానే ఏడవకపోవడం కదలికలు లేకపోవడం గమనించిన ఈఎంటి భరత్ వెంటనే సిపిఆర్ టెక్నిక్స్ సాయంతో ప్రథమ చికిత్స చేస్తూ ఊపిరి పోశాడు, వెంటనే తల్లి బిడ్డను నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు, అక్కడ డాక్టర్ మహేందర్ గారు పరీక్షించి, శిశు పుట్టగానే ఏడవకపోవడం మరియు బరువు తక్కువగా ఉండడం మరియు అత్యవసరం వైద్యం నిమిత్తం కొరకు, నారాయణపేట జిల్లా ఆస్పత్రిలో ఉండే ఉచిత మాత శిశు 108అంబులెన్స్ లో వెంటిలేటర్ సహాయంతో మహబూబ్నగర్ జిల్లా ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం పంపించారు, ఈ సందర్భంగా అత్యవసర సమయంలో ఆపద్బాంధవులుగా, అపర సంజీవని లాగా సేవలు చేస్తున్న 108 సిబ్బందిని, ఈఎంటి భరత్ పైలట్ వెంకటేష్ లను జిల్లా ఆస్పత్రి వైద్యులు మరియు పేషెంట్ బంధువులు అభినందించారు

## దేశ భవిష్యత్తు కోసం యువత పాటుపడాలి

- జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు
- ఎండల తీవ్రత నుంచి బయటపడేందుకు తాగునీరు ఎక్కువ త్రాగాలి
- డాక్టర్.హేమంత్ న్యూరో ఫిజీషియన్



నాగర్ కర్నూల్ : మే 22 (ప్రజా జ్యోతి ) చిన్నతనం నుండే ప్రతి విద్యార్థి తన శరీర దృఢత్వాన్ని పెంచుకునేందుకు కృషి చేస్తూ యువత దేశ భవిష్యత్తు కోసం పాటుపడాలని అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ మైదానంలో అథ్లెటిక్స్ కోచింగ్ అకాడమీ కోచ్ మల్లేష్ఆధ్వర్యంలో నిత్యం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రముఖ న్యూరాలజీ వైద్యులు డాక్టర్ హేమంత్ కుమార్ న్యూరో ఫిజీషియన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ అకాడమీ 60 ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు ఎస్పి వెంకటేశ్వలు హాజరై మాట్లాడుతూ తరగతి గదుల్లో విలువలతో కూడిన విద్యతో పాటు శరీర దృఢత్వాన్ని పెంచుకునేందుకు మైదానంలోకూడా నిత్యం వ్యాయామం ఎంతో అవసరమని అందుకు నిత్యం విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న మల్లేష్ సేవలు అభినందనీయమని కఠోర శిక్షణను గుర్తించిన ప్రముఖ న్యూరాలజీ వైద్యులు డా. హేమంత్ న్యూరో దాతృత్వం ఎంతో గొప్పదని 30 విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేయాలనుకోవడం గర్వించదగ్గ విషయమని వాటి విలువ రూ : 50 వేల ఉంటుందని అన్నారు.ఈ సందర్భంగా ఏకరూప దుస్తులు పంపిణీ చేసిన ప్రముఖ వైద్యులు డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్ వినియోగాన్ని తగ్గించుకొని ప్రస్తుతం ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని నీటిని ఎక్కువగా తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వి. ప్రియాంక,ఈ.ఎన్.టి.స్పెషలిస్ట్ డాక్టర్ త్రినాథ్, స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్.వివేక్ ఫిజియోథెరపీ నిర్వాహకులు చంద్రపాల్ రెడ్డి,కోచ్ మల్లేష్, విద్యార్థులు ఉన్నారు.

## పంట నమోదు నిర్లక్ష్యంతో రైతులకు ఇబ్బందులు

గండీడ్, మే 22: (ప్రజాజ్యోతి ) పంట నమోదు ప్రక్రియలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని పలు గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాము పండించిన పంటలను ఆన్లైన్లో నమోదు చేయకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. గండీడ్ మండల పరిధిలోని సాలార్ నగర్ గ్రామానికి చెందిన రైతు భద్రేశ్వర్ తాను సాగు చేసిన వరి ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి వెళ్లగా, ఆన్లైన్లో పంట నమోదు కాలేదని అధికారులు చెప్పడంతో ధాన్యం అమ్మడంలో జాప్యం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నమోదు సమయంలో తన పంట వివరాలు అధికారులు అడగలేదని, గతంలో ఫోన్ చేసి అడిగితే నమోదు అయ్యిందని చెప్పారని తెలిపారు. అయితే ప్రస్తుతం ఆన్లైన్లో నమోదు కనిపించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. తనలాగే గ్రామంలో మరికొంత మంది రైతుల పంటలు కూడా నమోదు కాలేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో రైతులు ధాన్యం విక్రయానికి ఇబ్బందులు పడుతూ కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయమై వ్యవసాయ అధికారులను వివరణ కోరగా, ఏఈఓ శివలీల మాట్లాడుతూ రైతులు రైతు వేదిక వద్దకు వచ్చి తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. రైతు వేదిక వద్ద నమోదు చేయించని వారి వివరాలు ఆన్లైన్లో నమోదు కావని ఆమె వివరణ ఇచ్చారు.

## షాట్ సర్క్యూట్ తో ఫీజ్ బాక్స్ దగ్ధం

- -అప్రమత్తమైన విద్యుత్ అధికారులు



నగర్ కర్నూల్ : మే 22 (ప్రజా జ్యోతి) నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో కరెంటు షార్ట్ సర్క్యూట్ తో ఫీజు బాక్స్ దగ్ధమైన సంఘటన చోటుచేసు కుంది. కరెంట్ స్థంబానికి ఉన్న మీటర్లలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగగా మంటలను గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది విద్యుత్ సరఫరాను ఆపి మంటలను అదుపులోకి తెచ్చారు.ఈ ఘటనతో కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా పట్టణ ప్రజలు భయఆందోళనకు గురయ్యారు.

## నానో ఎరువులపై రైతులకు అవగాహన

- - 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్టె విత్తనాల పంపిణీ



మహబూబ్నగర్, మే 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ) ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తొలుత కలెక్టరేట్ ఆవరణలో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాల్లో నానో యూరియా, నానో డి.ఏ.పీ. ఎరువులను ప్రదర్శించి రైతులకు వాటి వినియోగం, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఆధునిక వ్యవసాయ విధానాల ద్వారా దిగుబడులు పెంచడంతో పాటు ఖర్చులు తగ్గించుకోవచ్చని రైతులకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి 10 మంది రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్టె విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి, జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.